భానుడి భగపగ



- నిప్పులు కక్కుతున్న సూర్యుడు
- మేలో మాదిరిగా భారీ ఉష్ణోగ్రతలు
- 43 డిగ్రీలు దాటిన ఎండ
- ఉక్కిరిబిక్కిరి అవుతున్న జనం
- అల్లాడిపోతున్న వృద్ధులు, పిల్లలు

భానుడు భగ పగ పట్టాడు. మేలో మాదిరిగానే నిప్పులు కక్కుతున్నాడు. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెంచుకుంటూ పోతున్నాడు. సాధారణంగా జూన్ మొదటి వారంలో వాతావరణం కొంత చల్లబాడుతుంది. ఈ ఏడాది పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. జిల్లాలో బుధవారం పలు ప్రాంతాల్లో 43 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండకు తోడు వేడిగాలులు, తీవ్ర ఉక్కపోతతో జనం అల్లాడిపోయారు. ఎండ వేడిమికి పిల్లలు, వృద్ధులు, రోగులు విలవిల్లాడారు. ఎండ తీవ్రతకు రద్దీగా ఉండే రోడ్లు కూడా నిర్మానుష్యంగా మారి కర్ఫ్యూని తలపించాయి.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఉదయం ఎనిమిది గంటల నుంచే భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. పది గంటల తర్వాత ఇంటి నుంచి బయటకు రావడానికే జనం భయపడుతున్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లోనూ 38 డిగ్రీల నుంచి 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. బుధవారం శ్రీకాకుళం, పలాస, ఇచ్ఛాపురం, రణస్థలం, నరసన్నపేటలో 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆమదాలవలస, టెక్కలిలో 42 డిగ్రీలు, పాతపట్నం, కొత్తూరులో 41 డిగ్రీల సెల్సియస్‌గా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మొత్తమ్మీద భానుడు బుధవారం మరింత మండిపోయాడు. పది గంటల నుంచే వేడి గాలులు వీచాయి. ఉక్కపోత కూడా తీవ్రంగా ఉండడంతో ఇబ్బందులు పడ్డారు. ఆరుబయట పనులు ఉన్న వారు అపసోపాలు పడ్డారు. అత్యవసర ప్రయాణాలు చేసే వారు టోపీలు, స్కార్ఫ్‌లు ధరించారు. ఇంట్లో ఫ్యాన్ కింద ఉన్నా వేడిగాలులు వీయడంతో ఉక్కపోతతో అల్లాడారు. వృద్ధులు, చిన్నారులు, రోగులు పడిన అవస్థలు అంతా ఇంతా కాదు. మరోవైపు ఎండ వేడిమి నుంచి ఉపశమనం కోసం పళ్లరసాలు, కొబ్బరి బొండాలను ఆశ్రయించడంతో ఆ దుకాణాలు రద్దీగా కనిపించాయి. ఎండ వేడిమి తీవ్రతతో రోడ్లపై జనం రద్దీ బాగా తగ్గింది. మరో మూడు, నాలుగు రోజుల పాటు గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

శ్రీకాకుళం : ఎండ తీవ్రతకు జనం లేక బోసిపోయిన రహదారి

పలుచోట్ల నమోదైన ఉష్ణోగ్రతలు

ప్రాంతం	గరిష్టం	కనిష్టం
శ్రీకాకుళం	43	29
పలాస	43	29
ఇచ్ఛాపురం	43	29
రణస్థలం	43	30
నరసన్నపేట	43	29
ఆమదాలవలస	42	29
టెక్కలి	42	28
పాతపట్నం	41	29
కొత్తూరు	41	28

కూలీల ఉక్కిరిబిక్కిరి

ఎండలో కొద్దిసేపు ప్రయాణించడమే కష్టంగా ఉన్న వేళ ఉపాధి, భవన నిర్మాణ పనులు చేస్తున్న కూలీల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఎండ వేడిమి, తీవ్ర ఉక్కపోతతో కూలీలు ఉక్కిరిబిక్కిరయ్యారు. మండుటెండలో పనిచేయలేక ఆపసోపాలు పడ్డారు. ఉపాధి హామీ పని ప్రదేశాల్లో టెంట్లు లేకపోవడంతో చెట్ల కిందే సేదతీరారు. మరోవైపు తోపుడుబళ్లపై వ్యాపారాలు చేసే వారు మండుటెండలోనే వ్యాపారాలు సాగించారు. కూరగాయల వ్యాపారుల, కూలీలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

బూర్జ : చెట్ల నీడన సేదతీరుతున్న పశువులు

ఈదురుగాలుల బీభత్సం

ప్రజాశక్తి - నందిగాం

ఉదయం నుంచీ ఎండ వేడిమి, వడగాలులు, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలకు సాయంత్రం వీచిన భారీ ఈదురుగాలులతో ఉపశమనం కలిగింది. మండలంలోని పెద్దలవునపల్లి, కంచివూరు, కామధేనువు, కృష్ణరాయపురం గ్రామాల్లో బుధవారం సాయంత్రం మేఘావృతమైంది. ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. భారీగా వీచిన ఈదురుగాలులకు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. కంచివూరు వద్ద రోడ్డుకు అడ్డంగా వైర్లు పడడంతో రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. పలు ప్రాంతాల్లో మామిడికాయలు నేలరాలాయి. అరటితోటలు నేలవాలాయి. గాలులకు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. విద్యుత్ స్తంభాలు, వైర్లు పడిన చోట్ల విద్యుత్ సిబ్బంది పునరుద్ధరణ పనులు చేపట్టారు. గాలుల ప్రభావం తగ్గాక తిరిగి విద్యుత్‌ను సరఫరా చేశారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభం

ఎసిబికి చిక్కిన ఎస్ఇబి సిఐ, ఎస్ఐ

రూ.15 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం

ప్రజాశక్తి - పొందూరు

స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఇబి) సిఐ పి.శ్రీనివాసరావు, ఎస్ఐ కె.మురళి అవినీతి నిరోధకశాఖ అధికారులకు చిక్కారు. మద్యం అక్రమ రవాణా కేసులో రూ.15 వేలు లంచం తీసుకుంటూ బుధవారం పట్టుబడ్డారు. ఎసిబి శ్రీకాకుళం డిఎస్‌పి బి.వి.ఎస్ రమణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం... పొందూరు ఎస్ఇబి సర్కిల్ పరిధిలోని జి.సిగడాం మండలం నిద్దాంకు చెందిన ఒక వ్యక్తి గత నెల 25వ తేదీన ఐదు మద్యం సీసాలను తీసుకెళ్తుండగా పొందూరు సమీపంలో ఎస్ఇబి అధికారులు పట్టుకున్నారు. స్థానికంగా పెద్ద మనుషుల మధ్యవర్తిత్వం వల్ల కేసు నమోదులో జాప్యం చేసినట్లు తెలుస్తోంది. దీనిపై కేసు నమోదు చేయకుండా ఉండాలంటే రూ.15 వేలు లంచం ఇవ్వాలని సిఐ శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. రూ.15 వేలు ఇస్తే నీకు బదులుగా మరొకరిని చూపుతామని, రూ.ఐదు వేలు ఇస్తే నువ్వే మరొక వ్యక్తిని తీసుకొస్తే అతనిపై కేసు నమోదు చేసి నిన్ను తప్పిస్తామని చెప్పారు. అడిగిన మొత్తాన్ని ఆ వ్యక్తి ఇవ్వకపోవడంతో కేసు నమోదు చేయకుండా రోజూ స్టేషన్ చుట్టూ తిప్పుతున్నారు. దీంతో విసిగి చెందిన ఆయన ఎసిబి అధికారులను ఆశ్రయించాడు. వారి సూచనల మేరకు ఆ వ్యక్తి ఎస్ఇబి సిఐకి ఫోన్ చేసి అడిగిన డబ్బులను ఇస్తానని ఫోన్ చేసి చెప్పాడు. తాను విశాఖపట్నంలో ఉన్నానని డబ్బులు స్టేషన్‌లో ఉన్న ఎస్ఐకు ఇవ్వాలని సిఐ చెప్పారు. దీంతో ఆయన స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ మురళికి రూ.15 వేలు ఇస్తుండగా ఎసిబి అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. విశాఖపట్నంలో ఉన్న సిఐ శ్రీనివాసరావును ఎసిబి అధికారులు పొందూరు తీసుకొచ్చారు. సిఐ, ఎస్ఐని అరెస్టు చేసిన ఎసిబి అధికారులు రిమాండ్‌కు తరలించారు. దాడిలో ఎసిబి సిఐలు భాస్కరరావు, హరి, ఎస్ఐలు సత్యారావు, చిన్నంనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఇబి ఎస్ఐ మురళిని విచారణ చేస్తున్న ఎసిబి అధికారులు

అంతర్రాష్ట్ర దొంగలు అరెస్టు

- 26.50 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం
- ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

జిల్లాలోని పలు ప్రాంతాల్లో బంగారు ఆభరణాలను అపహరిస్తున్న ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలు పోలీసులకు చిక్కారు. వీరి నుంచి 26.50 తులాల ఆభరణాలు, ఒక ద్విచక్ర వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను స్థానిక డిఎస్‌పి కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌పి జి.ఆర్ రాధిక వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం బరంపురానికి చెందిన పాత నేరస్తుడు బాలకృష్ణ సాహు అదే రాష్ట్రం గంజాం జిల్లాకు చెందిన లాడు ఆచారి గతేడాది ఏప్రిల్ నుంచి టెక్కలి, కోటబొమ్మాళి, నందిగాం, సారవకోట, జలుమూరు, పోలాకి, పాతపట్నం, హిరమండలం, మెళియాపుట్టి పోలీస్‌స్టేషన్ల పరిధిలో గొలుసు దొంగతనాలు చేశారు. ఈ చోరీలకు సంబంధించి ఆయా పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. కోటబొమ్మాళి మండలం చలమయ్యపేట జాతీయ రహదారి వద్ద తమ వద్ద ఉన్న చోరీ బంగారం కోసం బాలకృష్ణ సాహు, ఆచారి మాట్లాడుతున్న సమయంలో సెంట్రల్ క్రైమ్ స్టేషన్ ఎస్ఐ హరికృష్ణ, కోటబొమ్మాళి ఎస్ఐ మహమ్మద్ అలీ ఆధ్వర్యాన సిబ్బంది కె.మహందాత, ఎ.త్రినాథరావు, బి.లోకనాథం, డి.ఉమామహేశ్వరరావు వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 26.5 తులాల బంగారు ఆభరణాలతో పాటు ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఉన్న మరో నిందితుని కోసం గాలిస్తున్నారు. బాలకృష్ణ సాహుపై గతంలో 21 వరకు గొలుసు దొంగతనాల కేసులు ఉండగా, మూడు కేసుల్లో శిక్ష కూడా పడింది. ఒడిశా రాష్ట్రం బరంపురంలో నాటుసారా రవాణా, హత్యాయత్నం కేసులూ ఉన్నాయి. అరెస్టు చేసిన ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను రిమాండ్‌కు తరలించారు. గొలుసు దొంగతనాల కేసులను ఛేదించిన పోలీస్ సిబ్బందిని ఎస్‌పి అభినందించారు. సమావేశంలో టెక్కలి డిఎస్‌పి డి.బాలచంద్రారెడ్డి, సిఐ సూర్యచంద్రమౌళి, ఎస్ఐ ఎల్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వివరాలను వెల్లడిస్తున్న ఎస్‌పి రాధిక, స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

గుడ్డ సంచులను వినియోగించుకోవాలి

ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎం.నవీన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ సంచులను వీలైనంత వరకు తగ్గించి గుడ్డ సంచులను ప్రతిఒక్కరూ వినియోగించాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎం.నవీన్ ప్రజలకు పిలుపునిచ్చారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యాన స్థానిక రైతుబజారులో ఏర్పాటు చేసిన ఎటిబి (ఎనీ టైమ్ బ్యాగ్) మెషిన్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనాతో కలిసి ఆయన మాట్లాడుతూ ప్రజల జీవనశైలిలో మార్పులు తెచ్చేందుకు జిల్లాలో అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. అందులో భాగంగా ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని తగ్గిస్తున్నట్లు తెలిపారు. ఈ మెషిన్ ద్వారా గుడ్డతో తయారు చేసిన 8 కేజీల సరుకులు పట్టే బ్యాగులను రూ.10 చెల్లించి పొందవచ్చన్నారు. ఈ బ్యాగు ధర రూ.20 అయినా కాలుష్య నియంత్రణ మండలి సబ్సిడీతో రూ.10కే అందిస్తోందని వివరించారు. రైతుబజారుకు వచ్చే కొనుగోలుదారులకు ఇది ఎంతో సౌలభ్యంగా ఉంటుందన్నారు. రూ.10 నోటు, రెండు రూ.5 నాణేలు, ఫోన్ పే ద్వారా కూడా ఈ సంచులు పొందేలా రూపకల్పన చేసినట్లు చెప్పారు. ఈ సంచులను ఒక్కసారికే కాకుండా తిరిగి వినియోగించుకునేందుకు వీలుంటుందన్నారు. అవసరమైన ప్రాంతాల్లో 15 మెషిన్ల వరకు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి కార్యనిర్వాహక ఇంజినీర్ ఎస్.శంకర్ నాయక్, సహాయ ఇంజినీర్ బి.కరుణశ్రీ, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, అర్బన్ మెడికల్ అధికారి యు.వి వెంకటరావు, జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్, జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు, జిల్లా పౌర సంబంధాల అధికారి కె.బి.ఎం సింగ్, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు కైలాస రావు, రైతుబజార్ ఎస్టేట్ అధికారి కె.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గుడ్డ సంచులను ప్రదర్శిస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ తదితరులు

బలసలరేవు వంతెన నిర్మాణంతో దశాబ్దాల కల సాకారం

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

బలసలరేవు వంతెన నిర్మాణంతో దశాబ్దాల కల సాకారం కానుందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని నాగావళి నది పరివాహక ప్రాంతమైన ఇసకలపేట నుంచి నాగావళి నదిలో నడుచుకుంటూ విజయనగరం జిల్లా సంతకవిటి మండలం వాల్తేరు వద్ద చేపడుతున్న వంతెన పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటు ఇసకలపేట ఇటు వాల్తేరు గ్రామాల మధ్య నాగావళి నదిపై బలసలరేవు వంతెన నిర్మాణానికి పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. రూ.87 కోట్లతో 480 మీటర్ల పొడవుతో 12.5 మీటర్ల వెడల్పుతో 40.22 కోట్ల అంచనాలతో వంతెన నిర్మాణం జరుగనుందని వివరించారు. వాల్తేరు వద్ద 770 మీటర్లు, ఇసకలపేట వద్ద 920 మీటర్ల వంతెనకు అప్రోచ్ రోడ్డు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఇందుకోసం 13.191 ఎకరాల భూమి అవసరమన్నారు. అత్యాధునిక పరికరాలతో వేగంగా వంతెన నిర్మాణం పూర్తి కానుందని తెలిపారు. వంతెన నిర్మాణానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గతంలో తాను మంత్రిగా ఉన్న రోజుల్లో ఈ వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టినా, ఎన్నికల కోడ్ అడ్డంకి కావడంతో ఆ ప్రతిపాదన మరుగున పడిందన్నారు. అప్పట్లో వంతెన నిర్మాణానికి రూ.పది కోట్లు మాత్రమే అవసరం ఉండేదన్నారు. మహా సంకల్పయాత్ర సందర్భంగా ఈ ప్రాంతానికి వచ్చిన జగన్మోహన్ రెడ్డి వంతెన నిర్మాణానికి హామీనిచ్చారని గుర్తు చేశారు. వంతెన లేకపోవడం వల్ల విద్య, వైద్యం, వ్యవసాయపరంగా ఇక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను గుర్తించారని చెప్పారు. వంతెన నిర్మాణం పూర్తయితే రైతుల వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం లభించి, భూముల ధరలకు మంచి డిమాండ్ పెరుగుతుందని తెలిపారు. ఆమదాలవలస, శ్రీకాకుళం, పొందూరు, పాలకొండ, జి.సిగడాం, సంతకవిటి మండలాల ప్రజలకు ప్రయోజనం కలుగనుందన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, సర్పంచ్ తమ్మినేని వాణిశ్రీ, వైసిపి మండల అధ్యక్షులు తమ్మినేని శ్రీరామ్మూర్తి, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ గురుగుబెల్లి స్వామినాయుడు, మెట్ట ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

పరీక్షను పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ నవీన్

గ్రూప్-1 పరీక్షలు పరిశీలన

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఎపిపిఎస్‌సి ఆధ్వర్యాన స్థానిక మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న గ్రూప్-1 పరీక్షలను ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎం.నవీన్ ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనాతో కలిసి బుధవారం పరిశీలించారు. పరీక్షల నిర్వహణలో ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. పరీక్షా కేంద్రం వద్ద అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేసి పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ఎటువంటి అవాంతరాల్లేకుండా సమర్థవంతంగా నిర్వహించేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. పరీక్షా కేంద్రంలోకి అభ్యర్థులను మినహా మిగతా వారిని అనుమతించరాదని స్పష్టం చేశారు. ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రానికి అనుమతించరాదన్నారు. బుధవారం నిర్వహిస్తున్న పరీక్షకు 353 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా, 282 మంది హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరాములు నాయుడు తెలిపారు.

సమన్వయంతో రోడ్డు ప్రమాదాల నివారణ

టెక్కలి : రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి అన్నారు. రోడ్డు భద్రతపై సబ్ కలెక్టర్ కార్యాలయంలో టెక్కలి డిఎస్‌పి బాలచంద్రారెడ్డితో కలిసి అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడిపితే అపరాధ రుసుము వసూలు చేయాలని చెప్పారు. ఎక్కడైనా రోడ్లు ఆక్రమణలకు గురైతే తక్షణమే తొలగించాలని ఆదేశించారు. రోడ్ల పక్కన ఏర్పాటు చేసిన తోపుడుబళ్లను పట్టణానికి దూరంగా ఉన్న ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో కార్యాలయ ఎఒ రాజమోహన్, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ సంజీవరావు, పంచాయతీరాజ్ ఇఇ సురేష్‌కుమార్, ఆర్అండ్‌బి ఇఇ పి.సత్యనారాయణ, విద్యుత్‌శాఖ ఇఇ, టెక్కలి, పాతపట్నం సిఐలు చంద్రమౌళి, ఎం.వినోద్‌బాబు, టెక్కలి సబ్ డివిజన్ పరిధిలోని ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

12వ పిఆర్‌సి ఏర్పాటు నిర్ణయంపై హర్షం

శ్రీకాకుళం : ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ తరుపున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఆ సంఘ రాష్ట్ర సహాధ్యక్షులు చౌదరి పురుషోత్తం నాయుడు, జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం, కార్యదర్శి చల్లా శ్రీనివాసరావు తెలిపారు. నగరంలోని ఎన్‌జిఒ హోంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాల పరిమితిలోనే 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం నిర్ణయించడంపై హర్షం వ్యక్తం చేశారు. 2014 జూన్ రెండో తేదీ నాటికి ఐదేళ్లు పూర్తయిన కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. జిల్లా ఎంపిక కమిటీ ద్వారా రూల్ ఆఫ్ రిజర్వేషన్‌లో కేడర్ సంఖ్య ప్రకారం నియామకాలు చేసిన అన్ని ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న మొత్తం కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని కోరారు. అవుట్‌సోర్సింగ్ కార్పొరేషన్ ద్వారా పనిచేస్తున్న ఉద్యోగులకూ కనీస వేతనం అందజేయాలన్నారు. పెండింగ్ డిఎలు, పాత పిఆర్‌సి బకాయిలూ వీలైనంత త్వరగా చెల్లించాలన్నారు.

మాట్లాడుతున్న పురుషోత్తంనాయుడు, సాయిరాం

దరఖాస్తులకు ఆహ్వానం

శ్రీకాకుళం : ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని 38 మండల సహిత విద్యా కేంద్రాల్లో పనిచేస్తున్న రిసోర్స్‌పర్సన్లు రిక్వెస్ట్, హ్యుమానిటేరియన్ గ్రౌండ్స్ బదిలీ ప్రాతిపదికన దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సమగ్ర శిక్ష అదనపు పథక సమన్వయకర్త ఆర్.జయప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఈనెల 8, 9 తేదీల్లో స్వయంగా సమగ్ర శిక్ష కార్యాలయ పనివేళల్లో అందజేయాలని పేర్కొన్నారు.

బహిరంగ ప్రకటన

నేను అనగా **రాగోలు లేటు చిన్నోడు గారి కుమారుడు రాగోలు గురువులు** శ్రీకాకుళం జిల్లా, నరసన్నపేట మండలం, చిన్నకరగాం గ్రామనికి చెందిన **యళ్ల నరసింహులు గారి కుమారుడు యళ్ల మల్లేశ్వరరావుకు** శ్రీకాకుళం జిల్లా, శ్రీకాకుళం సబ్ డివిజన్ శ్రీకాకుళం మండలం, బలగ రూరల్(చాపురం) పంచాయితీ, బలగ గ్రామము లెక్క దాఖల సర్వే నెం. 6-5లో భాగం అయినటువంటి య. 0-21 సెంట్లులో 3 సెంట్లు గల ఖాళీ స్థలం ఈ క్రింది షెడ్యూల్‌లో తెలిపిన స్థిరాస్తిని నేను **తేది 23-02-2023 అగ్రిమెంట్ చేసుకున్నాను.** నేను ఒకవారం రోజుల్లో ఈ క్రింది షెడ్యూల్ దాఖలాస్థిని రిజిస్టేషన్ చేసుకుంటున్నాను.

కావున షెడ్యూల్ దాఖలాస్థికి సంబంధించి ఎటువంటి వివాదములు లేక అభ్యంతరములు ఉన్నట్లయిన నాకు **7 రోజులలోగా** తెలియజేయగలరని అట్లు లేనిచో షెడ్యూల్ దాఖలాస్థిని నిర్వివాదమైన ఆస్థిగా భావించి నేను రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నాను.

షెడ్యూల్ ఆస్థి వివరములు

శ్రీకాకుళం జిల్లా, శ్రీకాకుళం సబ్ డివిజన్ శ్రీకాకుళం మండలం, బలగ రూరల్(చాపురం) పంచాయితీ, బలగ గ్రామము లెక్క దాఖల సర్వే నెం. 6-5లో భాగం అయినటువంటి య. 0-21 సెంట్లులో 3 సెంట్లు గల

ఖాళీ స్థలంకు హద్దులు :
తూ: **తాడేల సౌందర్య గారి ఖాళీస్థలం**
ద: **సాదు గోవిందరాజులు గారి తాలూక పల్లం భూమి**
ప: **సాదు లక్ష్మణరావు గారి తాలూక పల్లం భూమి**
ఉ: **బరాటం గోవిందరాజులు గారి తాలూక పల్లం భూమి**

ఇట్లు
రాగోలు గురువులు,
శ్రీకాకుళం, సెల్: 9441853864

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM S.O.P. 4/2023

Between: Doki Santhoshi Kumari w/o late Srinivasarao, | Aged 30 years, R/o D. No.23-175, Maruthinagar-1, Narasannapeta town, Post and Mandal, Srikakulam dist.-532421.
--Petitioner
And: Nil --Respondents

పై నంబరు పిటిషనులో పిటిషనరు అత్త గారైన లాడి కళ్యాణమ్మ గారు తే 01-10-2020 దీన కాలము చేసినందున పిటిషనరు మాత్రమే ముఖ్య వారసురాలై జీవించి యున్నది. తదుపరి ఆమె కుమారుడు, పిటిషనరు, భర్త గారు అయిన డోకి శ్రీనివాసరావు గారు తే 19-12-2021 దీని కాలం చేసినందున పిటిషనరు మాత్రమే వారిరువురకు ముఖ్య వారసురాలై జీవించి యున్నది. లేటు లాడి కళ్యాణమ్మ గారు. జీవించి ఉన్న తన జీవిత కాలంలో ఆంధ్ర బ్యాంకు ప్రస్తుతం U.B.I. నరసన్నపేట బ్రాంచి నందు డబ్బులు ఫిక్స్‌డు డిపాజిట్లు మూలంగాను, బంగారు ఆభరణములు లాకరులో భద్ర పరిచి కాలం చేసినందున ప్రస్తుత పిటిషనరు గారు మాత్రమే ముఖ్య వారసురాలై ఉన్నందున షెడ్యూల్ లో తెలిపిన సదరు డబ్బు, బంగారు ఆభరణములు బ్యాంకు నుండి పొందు నిమిత్తం హక్కు కలిగి ఉన్నందున పిటిషనరు పరమున Succession Certificate జారీ చేయమని కోరుచు పై కోర్టు నందు S.O.P. 4/2023 పిటిషన్ దాఖలు చేసి ఉన్నారు. సదరు పీటిషన్ జనరల్ నోటీసు నిమిత్తమై **తే 13-06-2023 దీకి వాయిదా అయి ఉన్నది.** కావున పై నంబరు పిటిషన్ పై ఎవరికైనను ఎట్టి ఆక్షేపణలు ఉన్న యడల పై కోర్టు వారి ఎదుట **తే 13-06-2023 దీన పగలు 10-30 గంటలకు** స్వయముగా కానీ వకీలు ద్వారా కానీ హాజరై తెలియపరచు కోవలెను. లేని యడల పిటిషనరు పరమున Succession Certificate శ్రీ కోర్టు వారు జారీ చేయుదురని ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడ మైనది.

తేది: 08-06-2023
నరసన్నపేట

ఇట్లు,
ఇప్పిలి తాత
వారణాశి జగన్నాధరావు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM S.O.P. 5/2023

Between: Doki Santhoshi Kumari w/o late Srinivasarao,Aged 30 years, R/o D. No.23-175, Maruthinagar-1.Narasannapeta town, Post and Mandal, Srikakulam dist -532421.
--Petitioner
And: **Nil** --Respondents

పై నెంబరు పిటిషనులో పిటిషనరు భర్త గారైన డోకి శ్రీనివాసరావు తే 19-12-2021 దీన కాలము చేసినందున పిటిషనరు మాత్రమే ముఖ్య వారసురాలై జీవించి యున్నది. లేటు డోకి శ్రీనివాసరావు గారు జీవించి ఉన్న కాలంలో ఆంధ్ర బ్యాంకు ప్రస్తుతం U.B.I. నరసన్నపేట బ్రాంచి నందు డబ్బులు ఫిక్స్‌డు డిపాజిట్లు మూలంగాను డిపాజిట్ చేసి, కొంత డబ్బు అప్పు మూలంగా సదరు బ్యాంకు నుండి వాడి యున్నారు. ప్రస్తుత పిటిషనరు గారు తన భర్త డోకి శ్రీనివాసరావు గారు మరణానంతరం అతని యొక్క డిపాజిట్లుకు, అప్పులకు ముఖ్య వారసురాలై ఉన్నందున పిటిషన్ షెడ్యూల్ లొ తెలిపిన సదరు డిపాజిట్లుకు అప్పులు పోను సొమ్ము బ్యాంకు నుండి పొందు నిమిత్తం హక్కు కలిగి ఉన్నందున పిటిషనరు పరమున Succession Certificate జారీ చేయమని కోరుచు పై కోర్టు నందు S.O.P.5/2023 పిటిషన్ దాఖలు చేసి ఉన్నారు. సదరు పిటిషన్ జనరల్ నోటీసు నిమిత్తమై **తే 13-06-2023 దీకి వాయిదా అయి ఉన్నది.** కావున పై నంబరు పిటిషన్ పై ఎవరికైనను ఎట్టి ఆక్షేపణలు ఉన్న యడల పై కోర్టు వారి ఎదుట **13-06-2023 దీన పగలు 10-30 గంటలకు** స్వయముగా కానీ వకీలు ద్వారా గాని హాజరై తెలియపరచు కోవలెను. లేని యడల పిటిషనరు పరమున Succession Certificate శ్రీ కోర్టు వారు జారీ చేయుదురని ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడ మైనది.

తేది: 08-06-2023
నరసన్నపేట

ఇట్లు
ఇప్పిలి తాత
వారణాశి జగన్నాధరావు
పిటిషనరు తరపు న్యాయవాదులు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM. E.A. 154/2021 in E.P. 66/2018 in O.S. 321/2015

Between : **Mylapalli Narasimha Murty**
--Petitioner/Decree-Holder.
And : **Balivada Panduranga & Others**
--Respondents/Judgment Debtors.

To,
2nd Respondent:
Balivada Rajeswari, Wife of late Balivada Panduranga, Door. No. 8-6-90, Gorlevari Veedhi, G.T. Road, Srikakulam.
4th Respondent:
Balivada Nirmal Kumar, Son of late Balivada Panduranga, Door. No. 8-6-90, Gorle vari Veedhi, G.T. Road, Srikakulam. Now residing at Door. No. 4-11-10/3, First Floor, Manisha enclave, Pedda Waltair, Visakhapatnam town and District.

పై నంబర్ మెయిన్ అమలు పిటిషనులో sole judgment debtor అయిన బలివాడ పాండురంగ కాలం చేసివున్నందున, సదరు కాలం చేసిన బలివాడ పాండురంగ వారసులైన మిమ్ములను 2 నుండి 4 respondents / judgment debtors గా పై నంబర్ మెయిన్ అమలు పిటిషను చేర్పించమని కొరుచూ పై నంబరు E.A. 154/2021 పిటిషను డిక్రీహోల్డరు/వాది దాఖలుచేసి వున్నారు. సదరు పిటిషనులో 2 మరియు 4 respondents అయిన మీ హాజరు నిమిత్తం పై కోర్టు నందు **తే.28-06-2023 దీ కి వాయిదా అయి వున్నది.** కావున వాయిదా నాడు పగలు **10-30 గంటలకు** మీరు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ పై కోర్టు వారి యెదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియపరచు కోవలెను. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించడమగునని యిందు మూలంగా తెలియ పరచడమైనది.

SUDHA SURYA RAO
KARANAM APPALANAIDU
Advocates for the Petitioner/D.Hr.,
Srikakulam.

ఖాళీ బిందెలతో మహిళలు

చిన్నకొంచాడలో తాగునీటికి కటకట

ప్రజాశక్తి- పొందూరు

పది రోజులుగా తాగేందుకు గుక్కెడు నీరు దొరకకపోవడంతో మండలంలోని చిన్నకొంచాడ గ్రామస్తులు అల్లాడిపోతున్నారు. గ్రామంలో తాగునీరు సరఫరా చేసే మోటారు పాడైపోవడంతో నానా అవస్థలు పడుతున్నారు. అసలే వేసవి కాలం కావడంతో గుక్కెడు నీరు దొరకకపోవడంతో సుదూర ప్రాంతాల్లోని పొలాల్లో ఉన్న నేలబావులను బిందెలు పట్టుకుని వెళ్లి తెచ్చుకుంటున్నామంటూ మహిళలు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. తాగునీరు రాకపోవడంపై అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదంటూ గ్రామస్తులు చెబుతున్నారు. తరుచుగా మోటారు పాడైపోతుండడంతో తాగునీటి కష్టాలు మాకు తప్పడం లేదంటూ వాపోతున్నారు. అధికారులు తక్షణమే తాగునీటి మోటారుకు మరమ్మతులు చేపట్టి నీరు సరఫరా చేయాలని కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి ఎస్.రమేష్‌ను వివరణ కోరగా, ఈ సమస్యను ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు.

నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

అంగన్వాడీలకు నియామక పత్రాలు

ప్రజాశక్తి- రణస్థలం

స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అంగన్వాడీ కార్యకర్తల, సహాయకురాల నియామక పత్రాలను ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ బుధవారం అందజేశారు. మండలంలోని యర్రవరం పంచాయతీ కుమ్మరిపేట సహాయకులు, లావేరు మండలం బెజ్జిపురం-1 కార్యకర్తకు, జి.సిగడాం మండలం పెంట-1 సహాయకులుగా నియమితులు కావడంతో వారికి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, అయాలు బాధ్యతగా పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పిఒలు ఝాన్సీ, డి.పాపినాయుడు, జెడ్‌పిటిసి టొంపల సీతారాం, జెసిఎస్ ఇన్‌ఛార్జి చిల్ల వెంకటరెడ్డి, నాయకులు గొర్లె అప్పలనాయుడు, ఇజ్జాడ వెంకటరమణ, పున్నాన అక్కలనాయుడు పాల్గొన్నారు.

నగదును అందిస్తున్న నేతాజీ, ప్రసాదరావు

మల్లేశ్వరరావుకు దాతల అండ

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- కవిటి

'ఆసరా లేదు.. ఆదుకోండి' అని బుధవారం ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి దాతలు ఉదారంగా స్పందిస్తున్నారు. సోంపేటకు చెందిన వైశ్యరాజు వెంకన్న అందించిన రూ.3 వేలను వైస్ ఎంపిపి పూడి నేతాజీ, సర్పంచ్ పూడి ప్రసాదరావు బుధవారం మల్లేశ్వరరావుకు అందజేశారు. అనంతరం నేతాజీ మాట్లాడుతూ దయనీయ పరిస్థితిలో ఉన్న మల్లేశ్వరరావును ఆదుకునేందుకు మండలంలోని పలు స్వచ్ఛంద సంస్థలు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. అలాగే మల్లేశ్వరరావుకు ఆర్థిక సాయం అందించిన వెంకన్నకు కృతజ్ఞతలు తెలిపిన నేతాజీ దాతలు ఉదారంగా స్పందించి మల్లేశ్వరరావుకు అండగా నిలవాలని కోరారు.

వాహనాలకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్ ఆవరణలో పార్కింగ్ సెంటర్‌లో నిలుపుదల చేస్తున్న వాహనాలకు రక్షణ కల్పించాలని సిటిజన్ ఫోరం ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి మోహనరావు కోరారు. ఈ మేరకు రైల్వే డిఆర్‌ఎం అనూప్ప కుమార్ సత్పతికు వాటాప్స్‌లో బుధవారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రైల్వేస్టేషన్ ఆవరణలో వాహనాలు నిలుపుదల చేసేచోట షెల్టర్, పై కప్పు లేకపోవడంతో వాహనాలకు రక్షణ లేకుండాపోతుందని అన్నారు. పార్కింగ్ స్థలాన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. డిఆర్‌ఎం స్పందించి త్వరలో పనులు ప్రారంభిస్తామని చెప్పారని మోహనరావు తెలిపారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వెంకటరమణ

టిడిపి పూర్వ వైభవానికి కృషి

ప్రజాశక్తి- కొత్తూరు

టిడిపి పూర్వ వైభవానికి కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ పిలుపునిచ్చారు. మండలంలోని మాతల తన క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ టిడిపి విస్తృతస్థాయి సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. అనంతరం ఐదు కోట్ల మంది ప్రజలకు భవిష్యత్ గ్యారంటీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు మహానాడులో ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. మహాశక్తి, తల్లికి వందనం, రైతులకు అన్నదాత, మహిళలకు బస్‌పాస్, దీపం పథకం, నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలు, బిసిలకు రక్షణ చట్టంపై అవగాహన కల్పించాలన్నారు. వైసిపి అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలన్నారు. సమావేశంలో పార్టీ పరిశీలకులు కరణం శివరామకృష్ణ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్ పాల్గొన్నారు.

పశు బీమాతో రైతులకు ప్రయోజనం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

రాష్ట్ర ప్రభుత్వం పశువులకు, గొర్రెలకు, మేకలకు అందిస్తున్న వైఎస్ఆర్ పశువుల బీమా పథకాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోటబొమ్మాళి పశువైద్యాధికారి డాక్టర్ లఖినేని కిరణ్‌కుమార్ అన్నారు. బుధవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రతి పాడి రైతూ ఈ పశువుల బీమా పథకాన్ని నమోదు చేసుకోవాలన్నారు. ప్రీమియం సొమ్ము రైతు 20 శాతం చెల్లిస్తే... ప్రభుత్వం మిగిలిన 80 శాతం చెల్లిస్తుందని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే సన్నజీవాలు గొర్రెలు, మేకలకు ఉచిత నట్టల నివారణా మందులు వచ్చాయని, రైతు భరోసా కేంద్రాల ద్వారా పశువైద్య సహాయకులు వీటిని వేస్తారని తెలిపారు. నట్టల నివారణా మందులు తప్పనిసరిగా మేకలకు, గొర్రెలకు పట్టించాలన్నారు.

రహ'దారుణా'లు

- రోడ్డంతా గోతులమయం
- ఇబ్బందులు పడుతున్న వాహన చోదకులు, స్థానికులు
- పట్టని ప్రభుత్వ యంత్రాంగం

టెక్కలిపట్నం సమీపంలో గోతులమయమైన తారు రోడ్డు

ప్రజాశక్తి- పలాస

రెండు మండలాలకు కలిపే డబుల్ రోడ్డు పనులు ముందుకు సాగడం లేదు. రోడ్డు మంజూరై రెండేళ్లు కావస్తున్నా... పనుల శాతం అంతంత మాత్రంగానే ఉంది. మంజూరైన రోడ్డు పనులు నిలిచిపోగా, పాత రోడ్డు పూర్తిగా పాడవడంతో వాహన చోదకులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

పలాస మండలం రేగులపాడు నుంచి వజ్రపుకొత్తూరు మండలం నువ్వులరేవు వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం సెంట్రల్ రోడ్డు ఫండ్ నిధులు క్రింద రూ. 25 కోట్లు మంజూరు చేసింది. దీంతో రోడ్డు పనులు ప్రారంభంలో సరవేగంగా జరుగుతున్నాయని, ఇబ్బందులు తీరుతాయని వాహన చోదకులు స్థానికులు ఆనందపడ్డారు. గత ప్రభుత్వంలో రోడ్డు నిర్మించకపోయిన వైసిపి ప్రభుత్వం హయాంలో రోడ్డు పూర్తవుతుందని ఆనంద పడుతున్న సమయంలో రోడ్డు పనులు అటకెక్కింది. నువ్వులరేవు నుంచి రేగులపాడు వరకు సుమారు 16 కిలోమీటర్లు పొడవునా తారు రోడ్డు పనులు చేయాల్సి ఉండగా, కేవలం 30 శాతం పనులు చేపట్టి కాంట్రాక్టర్ చేతులు ఎత్తేశారు.

నిత్యం వాహనాల తాకిడి

పలాస మండలం రేగులపాడు నుంచి వజ్రపుకొత్తూరు మండలం వెంకటాపురం వరకు చాలా ఏళ్ల క్రితం రోడ్డు నిర్మించారు. ఈ రోడ్డుపై నిత్యం వాహనాల తాకిడి ఎక్కువగా ఉంటుంది. వెంకటాపురం, వీరభద్రపురం, మోదుగుల పుట్టి, టెక్కలి పట్నం, రేగులపాడు వరకు తారు రోడ్డు పూర్తిగా పాడైంది. రోడ్డు పొడవునా గొంతులతో నిండిపోయింది. ఈ రోడ్డుపై ప్రయాణం చేయలేక వాహనచోదకులు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ రోడ్డు మెళియాపుట్టి మండలం చీపురుపల్లి పెద్దమడి, చాపర, మెళియాపుట్టి ప్రాంతాలు కలుపుతూ ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడి వెళ్తుంది. దీంతో ఆర్‌టిసితో పాటు ప్రయివేటు బస్సులు, భారీ వాహనాలు రాకపోకలు చేస్తున్నాయి. రోడ్డుపై గోతులు ఉండడంతో ప్రయాణం చేయలేక పోతున్నామని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో గోతులో వాహనాలు దిగుబడి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. చిన్న పాటి వర్షం కురిస్తే చాలు గోతుల్లో వర్షపు నీరు నిల్వ ఉండడంతో ప్రయాణం చేసేందుకు ఇబ్బందిగా ఉందని వాహన చోదకులు, పాదచారులు, స్థానికులు వాపోతున్నారు. పాడైన రోడ్డుపై ప్రయాణం చేయడం ద్వారా ఎక్కువగా ద్విచక్ర వాహనాలు పాడవుతున్నాయని, ప్రమాదాలకు గురువుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బిల్లులు చెల్లించక నిలిచిన పనులు

నువ్వులరేవు నుంచి రేగులపాడు వరకు సుమారు 16 కిలోమీటర్లు పొడవునా తారు రోడ్డు నిర్మాణానికి రూ.25 కోట్లు మంజూరైంది. ఇప్పటి వరకు రోడ్డు పనులతో పాటు మోదుగులపుట్టి ప్రాంతంలో వంతెన, వెంకటాపురంలో సిసి రోడ్డు నిర్మాణ పనులు జరిగాయి. సుమారు 30 శాతం పనులకు గాను సుమారు రూ.8 కోట్ల వ్యయంతో కాంట్రాక్టరు రోడ్డు పనులు చేపట్టారు. రెండేళ్లు కావస్తున్నా ప్రభుత్వం చేసిన పనులకు గాను ఒక్క రూపాయి నిధులు మంజూరు చేయకపోవడంతో తాను రోడ్డు పనులు చేయలేనని చేతులు ఎత్తేశారు. దీంతో ఆర్‌అండ్‌బి అధికారులు కాంట్రాక్టరుపై ఒత్తిడి పెట్టిన ఫలితం లేకపోయింది. ప్రభుత్వం నిర్లక్ష్యానికి అటు కాంట్రాక్టరు మరోవైపు వాహన చోదకులు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఒక రోడ్డు పనులు చేపట్టేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందంటే రోడ్డు పూర్తయ్యే వరకు ఎటువంటి అదనపు పనులు గానీ, తాత్కాలిక పనులు గానీ, మరమ్మతులు చేపట్టేందుకు నిధులు మంజూరు చేయదు. దీంతో గత రెండేళ్లుగా వాహన చోదకులు స్థానికులు ఇబ్బందులు పడి ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. రోడ్డు పాడైందని అధికారులకు తెలిసినా ఏమి చేయలేని పరిస్థితి. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ చూపి చేసిన పనులకు కాంట్రాక్టరు నిధులు మంజూరు చేసి తారు రోడ్డు పనులు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని వాహన చోదకులు, పాదచారులు, స్థానికులు కోరుతున్నారు. ఇదే విషయంపై పలాస ఆర్‌అండ్‌బి ఎఇఇ విక్రంను వివరణ కోరగా, రేగులపాడు నుంచి వెంకటాపురం వరకు రోడ్డు పాడైందని, సిఆర్‌ఎఫ్ నిధులతో డబుల్ రోడ్డు పనులు చేపడుతున్నాం. కాంట్రాక్టరుకు చేసిన పనులకు సంబంధించి బిల్లులు చెల్లించకపోవడంతో ప్రస్తుతం రోడ్డు పనులు పూర్తి స్థాయిలో జరగలేదన్నారు. త్వరలో సంబంధిత కాంట్రాక్టరుతో మాట్లాడి తారు రోడ్డు పనులు పూర్తి చేసి ప్రయాణానికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతామని చెప్పారు.

చిరస్మరణీయులు రాజగోపాలరావు

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

మాజీ పార్లమెంట్ సభ్యులు కీర్తిశేషులు బొడ్డేపల్లి రాజగోపాలరావు చేసిన సేవలు, అభివృద్ధి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని శాసనసబ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని అక్కులపేటలో రాజగోపాలరావు శత జయంత్యుత్సవాలను ఆయన మనవడు, మున్సిపల్ మాజీ చైర్మన్ బొడ్డేపల్లి రమేష్ అధ్యక్షతన బుధవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా రాజగోపాలరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొదటి సార్వత్రిక ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికయ్యారని, ఆ తరువాత నెహ్రూ పిలుపు మేరకు కాంగ్రెస్ పార్టీలో చేరి ఆరు పర్యాయములు జిల్లా ఎంపీగా గెలుపొంది తనదైన ముద్రను వేశారని గుర్తు చేశారు. వంశధార ప్రాజెక్టు రూపకర్త, చక్కెర కర్మాగారం, నైర, రాగోలు వ్యవసాయ క్షేత్రాలు, శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల, ఉద్దానం కొబ్బరి పరిశ్రమ ఇలా చెప్పుకుంటూ పోతే లెక్కలేనన్ని అభివృద్ధి కార్యక్రమాలను జిల్లాలో చేపట్టారని గుర్తు చేశారు. జూన్ 15 16వ తేదీల్లో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామని కమిటీ నిర్వాహకులు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎన్‌టిఆర్ నగరపాలక ఉన్నత పాఠశాల మైదానంలో జూన్ 21న ముంగిపు ఉత్సవాలు నిర్వహిస్తామని అన్నారు. మాజీ ఎమ్మెల్యే, డిసిసి అధ్యక్షులు అధ్యక్షులు బొడ్డేపల్లి సత్యవతి మాట్లాడుతూ ఈ రోజున తాము ఇంత గుర్తింపు పొందానికి తమ మామ రాజగోపాలరావు అని అన్నారు. వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డిని తాను వంశధార ప్రాజెక్టుకు రాజగోపాలరావు పేరు పెట్టాలని కోరగా, మూడు రోజుల వ్యవధిలో జిఒను జారీ చేసి తనను గౌరవించారని అన్నారు. అనంతరం గ్రామంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు సువ్వారి గాంధీ, చింతాడ రవికుమార్, జెడ్‌పిటిసి మాజీ బొడ్డేపల్లి మాధురి, మాజీ ఎంపిపి బొడ్డేపల్లి గోవిందగోపాల్, శ్రీనివాసచార్యులపేట, అక్కులపేట సర్పంచ్‌లు బొడ్డేపల్లి గౌరీపతి, వసుమతి, బాడాన దేవభూషణరావు, సనపల అన్నాజీరావు, సువ్వారి నేతాజీ, బొడ్డేపల్లి రమేష్ కుమార్ పాల్గొన్నారు.

విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న స్పీకర్ సీతారాం

జీడికి రూ.16 వేలు మద్దతు ధర ప్రకటించాలి

ప్రజాశక్తి- పలాస

ఉద్దానంలో విస్తారంగా పండే జీడిపంట రైతులను ప్రభుత్వం అన్నివిధాల ఆదుకోవాలని, 80 కిలోల జీడి పిక్కల బస్తాకు రూ.16 వేలు కనీస మద్దతు ధర కల్పించాలని ప్రజా సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. మండలంలోని బొడ్డపాడులో దేశభక్తి ప్రజాతంత్ర ఉద్యమం (పిడియం) ఆద్వర్యాన రైతులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా జీడి పిక్కలను కొనుగోలు చేయాలన్నారు. జీడిపరిశ్రమ కేంద్రాలు ప్రాంతాల వారీగా ఏర్పాటు చేసి, అభివృద్ధి చేసి నాణ్యమైన మొక్కలను అందించాలని కోరారు. జీడిపంట విస్తరణ నిర్వహణకు రాయితీలు ఇవ్వాలన్నారు. జీడి పంటకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంకు ద్వారా రుణులు మంజూరు చేయాలని కోరారు. ఉద్దాన ప్రాంతంలో జీడిపిక్కలు, జీడిపప్పుకు ప్రొసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలన్నారు. పిక్కలు ఆర బెట్టేందుకు టార్పాలిన్లను ఉచితంగా పంపిణీ చేయాలన్నారు. సమావేశంలో పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు పత్రి దానేషు, పిడిఎఫ్ జిల్లా అధ్యక్షులు భీమారావు, ప్రజా కళామండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి నీలకంఠం, ఉత్తరాంధ్ర మహిళా సంఘం గౌరవ అధ్యక్షులు పి.సుమఅరుణ, అధ్యక్షులు పి.నాగమణి, బత్తిని హిమేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన గ్రాడ్యుయేషన్, పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన నిరుద్యోగ యువతకు మెరుగైన నైపుణ్యాలను అందించేందుకు ఎచ్చెర్లలో స్కిల్ కళాశాల (టిటిడిసి ట్రైనింగ్ సెంటర్) ప్రాంగణంలో పేషెంట్ రిలేషన్స్ అసోసియేషన్ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.బి.సాయిశ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9 నుంచి ఈ శిక్షణ ప్రారంభిస్తామని అన్నారు. ఈ కోర్సుకు ఏదైనా డిగ్రీ కలిగిన వారు అర్హులన్నారు. 20 నుంచి 28 ఏళ్లలోపు వయసు గల నిరుద్యోగులకు మూడు నెలల పాటు శిక్షణ ఇస్తామని అన్నారు. అనంతరం ఏదైనా ప్రయివేటు సంస్థల్లో ఉద్యోగం కల్పిస్తామన్నారు. ఈ శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. అర్హత కలిగి ఉన్న యువతీ యువకులు వెంటనే ఫొటోలను సమర్పించి శిక్షణలో పాల్గొవాలని అన్నారు. మరిన్ని వివరాలకు 8247656581, 8790500572 సెల్ నంబర్లను సంప్రదించాలన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాహుల్‌కుమార్‌రెడ్డి

పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు డాక్టర్ బేపల సతీష్‌కుమార్ రచించిన పర్యావరణ రసాయనశాస్త్రం అనే పుస్తకాన్ని సబ్‌కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి తన ఛాంబర్‌లో బుధవారం పుస్తకాన్ని ఆవిష్కరించారు. ప్రస్తుతం డిగ్రీ చదువుతున్న విద్యార్థులు చదువుకునేందుకు వీలుగా ఆంగ్ల మాధ్యమంలో పుస్తకం రాశానని అధ్యాపకులు తెలిపారు. నూతన విద్యావిధానానికి అనుకూలంగా ఉందని తెలిపారు. అలాగే కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ కూడా సంతీష్‌కుమార్‌ను అభినందించారు. అనంతరం సతీష్‌కుమార్ తనయులు ధ్రువతేజ్, భువన్ తేజ్‌రెడ్డిలు అక్షర ఫౌండేషన్‌కు పుస్తకాలను అందించారు. కార్యక్రమంలో ఎఒ రాజ్‌మోహన్ పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న అధికారులు

'దీర్ఘాశి'కి వెయ్యేళ్ల చరిత్ర

ప్రజాశక్తి- పోలాకి

మండలంలోని దీర్ఘాశిలో ఉన్న జగన్నాథస్వామి ఆలయానికి వెయ్యేళ్ల చరిత్ర ఉందని పురావస్తు పరిశోధకులు, ప్లీస్ ఇండియా ఫౌండేషన్ సిఇఒ డాక్టర్ ఈమిని శివనాగిరెడ్డి అన్నారు. 11వ శతాబ్దానికి చెందిన జగన్నాథస్వామి ఆలయం, కీ.శ. 1075కు చెందిన శిలాశాసనం, శిథిల శిల్పాలను బుధవారం పరిశీలించారు. ఇక్కడ ఉన్న చారిత్రక అంశాలను భద్రపరచాలని సూచించారు. ఇంకా కొన్ని చారిత్రక విశేషాలు దశలవారీ బయట పడతాయని తెలిపారు. అనంతరం భగవతీ అమ్మవారి ఆలయం అవశేషాలు పరిశీలించారు. కార్యక్రమంలో బాపూజీ యువజన సంఘం నాయకులు, ఆలయ ధర్మకర్త పల్లి రాజు, గ్రామ పెద్దలు దాసునాయిడు, పాగోటి అశోక్, పి.వి.ఎస్.ఎన్.మూర్తి పాల్గొన్నారు.

సచివాలయ నిర్మాణ పనులు వేగవంతం

పలాస : సచివాలయ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎంపిడిఒ ఎన్.రమేష్‌నాయుడు ఆదేశించారు. మండలంలోని బ్రాహ్మణతర్ల సచివాలయం నిర్మాణ పనులను బుధవారం పరిశీలించారు. ఇప్పటి వరకు ఎంత వరకు పనులు జరిగాయి, ఎప్పటిలోగా పూర్తి చేస్తారు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. పనులు జరిగే సమయంలో పర్యవేక్షణ చేపట్టాలని సచివాలయం సిబ్బందికి ఆదేశించారు. నాణ్యత ప్రమాణాలతో పనులు చేపట్టాలని కాంట్రాక్టరుకు సూచించారు. ఈయనతో పాటు పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావుచిట్టి, ఇఒపిఆర్‌డి మెట్ట వైకుంఠరావు, బొత్స షణ్ముఖరావు, పొందర త్రినాథ్, సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ కంచరాన చాణక్య ఉన్నారు.

పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ రమేష్ నాయుడు

గోవిందపురంలో గడప గడపకు...

లావేరు : మండలంలోని గోవిందపురం ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ... ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో నేరుగా ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు దన్నాన రాజినాయుడు, అధికారులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

కోటబొమ్మాళి: మండలంలోని కురుడు పంచాయతీ పాకివలస ఎస్‌సి కాలనీ శ్మశాన వాటికకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎంపిటిసి చుక్కా లోకనాథం కోరారు. ఈ మేరకు మండల పరిషత్ సూపరింటెండెంట్ ఎస్.రాజేశ్వరమ్మను గ్రామస్తులతో కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డు సదుపాయం లేకపోవడంతో వర్షాకాలం మృతదేహాలను బురదలో తీసుకెళ్లాల్సి రావడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. దీనికి తోడు శ్మశాన వాటికి వెళ్లే దారిలో చిన్నచిన్న వాగులు ఉన్నాయని వివరించారు.

విత్తనాల పంపిణీ

ఇచ్ఛాపురం : ప్రభుత్వం రైతులకు ఇచ్చిన రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ అన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో రాయితీపై వరి, పచ్చిరొట్ట విత్తనాలను బుధవారం రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారిని శ్రీదేవి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దక్కత నూకయ్యరెడ్డి, మాజీ ఎంపిపి జె.కె.మోహనరావు, ఎంపిటిసి కేదారి, కౌన్సెలర్ నీలపు ఢిల్లీ పాల్గొన్నారు.

విత్తనాలను పంపిణీ చేస్తున్న పుష్ప, నారాయణమ్మ

కొత్తూరు : సామగ్రిని అందజేస్తున్న సభ్యులు

పలువురికి ఆర్థికసాయం

కొత్తూరు : స్థానిక రెల్లివీధికి చెందిన బొమ్మాళి బాబూరావు కాలుకు గాయం కావడంతో వైద్యులు ఆపరేషన్ చేయాలని సూచించారు. ఆపరేషన్ చేయించుకునేందుకు ఆర్థికస్తోమత లేకపోవడంతో దాతల కోసం ఎదురు చూస్తున్నారు. విషయం తెలుసుకున్న భగత్ సింగ్ ట్రస్టు సభ్యులు రూ.పది వేలు ఆర్థికసాయం అందించారు. అలాగే మదనపురానికి చెందిన ఆసరా సురేష్ గత నెలలో మృతి చెందారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వీరికి భగత్ సింగ్ ట్రస్టు సభ్యులు రూ.30 వేలు నగదు, రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను అందించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు నడిమింటి జగదీష్, కడగల పోలినాయుడు, పి.మనోజ్, జె.రాజు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీలో కొద్ది నెలలుగా ఎన్.శ్యామలాదేవి కేన్సర్‌తో బాధపడుంది. విషయం జనసేన నిజయోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు రూ.ఆరు వేలు ఆర్థికసాయం బుధవారం అందజేశారు. దాతలు ముందుకొచ్చి ఆర్థికసాయం అందజేయాలని కోరారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తిప్పన దుర్యోధనరెడ్డి, పదో వార్డు ఇన్‌ఛార్జి రోకళ్ల భాస్కరరావు, జనసైనికులు ఢిల్లీ, సురేష్, కిరణ్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం

గుర్తుతెలియని మహిళ మృతి

కోటబొమ్మాళి: మండలంలోని వాంగ్రాడ పంచాయతీ నర్సింగపల్లి సమీపం రాళ్ల చెరువు గట్టువద్ద గుర్తు తెలియని మహిళ బుధవారం మృతి చెందింది. మృతురాలి వయసు 50 ఏళ్లు ఉంటుంది. నలుపు రంగు నైటీ ధరించి ఉంది. రెండు మూడు రోజులుగా కంబకాయి గ్రామ చుట్టపక్కల మతిస్థిమితం లేక తిరుగుతుందని గ్రామస్తులు తెలిపారు. ఎండ తీవ్రంగా ఉండడంతో మృతి చెంది ఉంటుందని చెబుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలంకు చేరుకొని మృతదేహన్ని పోస్టుమార్టం కోసం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ ఎస్.కె.మహ్మద్ అలీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని వృద్ధునికి గాయాలు

జలుమూరు: మండలంలోని గంగాధరపేట వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కూన సూర్యనారాయణకు గాయాలయ్యాయి. గంగాధర పేటవద్ద ఉన్న ఓ దుకాణం వద్ద సామగ్రి కొనుగోలు చేసేందుకు అబ్బాయిపేటకు సూర్యనారాయణ వచ్చాడు. పని ముగించుకుని ఇంటికి వెళ్తేందుకు రోడ్డు దాటుతున్నాడు. ఈ సమయంలో చల్లవానిపేట నుంచి సారవకోట వైపు వెళుతున్న కారు ఢీకొంది. ఈ ఘటనలో వృద్ధుడు పైకి ఎగిరి రోడ్డు సెంటర్‌లో పడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు 108లో నరసన్నపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కుక్కల దాడిలో వ్యక్తికి...

ఆమదాలవలస : మండలంలోని నిమ్మతొర్లాడకు చెందిన గూనాపు సూర్యనారాయణపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. సూర్యనారాయణ గ్రామ శివారున ఉన్న నాగావళి నదికి బుధవారం స్నానానికి వెళ్తున్నాడు. ఒక్కసారిగా కుక్కల గుంపు ఆయనపై విరుచుకుపడి తీవ్రంగా గాయపరిచాయి. నాగవళి నదికి అవతల వైపున ఉన్న చిత్తారపురానికి చెందిన కొందరు విద్యార్థులు ఆ దాడిని గమనించి నదిలో నుంచి దిగి ఇవతల వైపుకు వచ్చి సూర్యనా రాయణను రక్షించారు. అప్పటికే సూర్యనారాయణ తీవ్రంగా గాయపడి విపరీతమైన రక్తస్రావం కావడం తో స్థానికులు హుటాహుటిన 108కు ఫోన్ చేశారు. 108 వాహనం సకాలంలో రాకపోవడంతో శ్రీకాకుళం వైపు వెళ్తున్న షేర్ ఆటో సహాయంతో జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు ప్రథమ చికిత్స అందించి విశాఖపట్నంలోని కెజిహెచ్‌కు రిఫర్ చేశారు.

కొల్లివలసలో పోలీస్ పికెట్

బూర్జ : మండలంలోని కొల్లివలసలో బుధవారం నుంచి పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ అశోక్‌బాబు తెలిపారు. గ్రామంలో ప్రేమ వ్యవహారానికి సంబంధించి మంగళవారం ఇరు గ్రూపుల మధ్య చోటు చేసుకున్న వివాదం కారణంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముందస్తుగా పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు చేయడం చేశామని అన్నారు.

ఆహ్వానిస్తున్న టిడిపి నాయకులు

గౌతు శిరీషకు ఆహ్వానం

పలాస : టెక్కలి నియోజకవర్గం కోటబొమ్మాళిలో నూతన తెలుగు దేశం పార్టీ కార్యాలయం ప్రారంభానికి టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీషను కోరారు. ఈ మేరకు స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం ఆమెకు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ నెల 10న ఉదయం 9 గంటలకు ప్రారంభం చేపడుతున్నామని తెలిపారు. ఆహ్వానం పలికిన వారిలో కోటబొమ్మాళి మండలం మండల అధ్యక్షుడు బోయిన రమేష్, యలమల కామేశ్వరరావు, విజయలక్ష్మి, టి.రామకృష్ణ, హెచ్.రామకృష్ణ, పి.అజయ్, జీరు భీమారావు, భగాది శేషు పాల్గొన్నారు.

రైలు ప్రమాద మృతులకు నివాళి

టెక్కలి : ఒడిశా రాష్ట్ర బాలాసోర్ వద్ద జరిగిన రైలు ప్రమాదంలో మృతి మృతులకు టెక్కలి గ్రంథాలయంలో విద్యార్థులు బుధవారం కొవ్వొత్తులు వెలిగించి నివాళ్లర్పించారు. గ్రంథాలయ వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా వాటి ఆవశ్యకతపై వ్యాసరచన పోటీలు నిర్వహించామని గ్రంథాలయాధికారి ఎస్.ఉదయ్‌కిరణ్ తెలిపారు. సహాయకులు అమ్మనమ్మ పాల్గొన్నారు.

నివాళ్లర్పిస్తున్న విద్యార్థులు